# మాతృ పూజ



శ్రీ సత్య సాయి బల వికాస్

శ్రీ సత్య సాయి సేవ సంస్థలు - తెలంగాణ

## మాతృపూజా విధానము

**మాతృ పూజకు కావలసిన సామాగ్రి:**

* స్వామి ఫోటో
* దీపారాధన కుందులు
* అమ్మ పాదాలు పూజించుటకు సరిపడు పళ్ళెము
* గ్లాస్ తో నీళ్లు, పళ్లెము, హారతిపళ్ళెము
* పసుపు, కుంకుమ, గంధము, అక్షతలు
* పూలు, అగరబత్తి, కర్పూరము, నీళ్లు, రవికగుడ్డ,
* స్వీటు, పండ్లు, బెల్లము.

ఈ పూజా సామాగ్రి లో ఏవైనా తక్కువ అయినచో అక్షతలతో పూజించవచ్చు.

తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణ చేసే విధంగా, ఆసనాల పై కూర్చుండబెట్టి, పక్కన మరో ఆసనంలో, స్వామివారి ఫోటోను అలంకరించి, దీపారాధన చేసి, గ్లాస్ తో మంచినీళ్లు ఉంచవలెను.

**మాతృదేవోభవ:**

ఈరోజు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి మాతృమూర్తి అయిన ఈశ్వరమ్మ గారి వర్ధంతి దినోత్సవం. కనుక ఈశ్వరమ్మ గారి గురించి తెలుసుకుందాం.

ఈశ్వరమ్మ గారు కర్నూలు మండలంలో కొలిమి కుంట్ల అనే గ్రామంలో శివభక్తుడైన మీసరగండ సుబ్బరాజుగారి ఇంట జన్మించారు. గొల్లపల్లి వాస్తవ్యులు శ్రీ కొండమ రాజు గారి పెద్ద కొడుకు అయిన పెద వెంకమ్మ రాజుగారిని పెండ్లాడారు. రత్నాకర వంశం వంటి పెద్ద కుటుంబంలో కోడలిగా అడుగుపెట్టిన ఆమె తన వినయవిధేయతలతో, పని పాటలతో, అత్తమామలకు, బంధువర్గానికి ప్రీతిపాత్రులయినారు.

**స్వామి జననం ప్రసవం కాదు, ప్రవేశం మాత్రమే.**

ఒకనాడు ఈశ్వరమ్మ గారు బావిలో నీరు తోడు తుండగా ఆకాశం నుండి దివ్య కాంతులు వెదజల్లే ఒక నీలలోహిత తేజో పుంజం గుండ్రంగా తిరుగుతూ ఆమెలో ప్రవేశించింది. ఆమె ఎన్నో దివ్యానుభూతులు అనుభవించింది. ఈశ్వరమ్మ గారి అత్తగారైన లక్ష్మమ్మ తమ పురోహితుని ఇంట్లో జరుగుతున్న సత్యనారాయణ స్వామి పూజ కి వెళ్లి, ఆ ప్రసాదం తెచ్చి కోడలికి ఇచ్చింది. అక్షయ నామ సంవత్సరం, కార్తీక సోమవారం, ఆరుద్రా నక్షత్రంలో భగవానుడు అవతరించాడు. ఆ బాలునికి సత్యనారాయణ అని పేరు పెట్టారు ముద్దుగా, తేజస్సుతో వెలిగిపోయే సత్యం అందరిని ఆకర్షించాడు. పాటలు పాడుతూ, నాట్యం చేస్తూ, నాటకాల్లో నటిస్తూ ఉంటే తన తనయునికి అన్ని విద్యలు ఎలా వచ్చాయా అని ఈశ్వరమ్మ గారు అబ్బుర పడేవారు. దినదినము పేరు ప్రఖ్యాతులు అధికమవుతుంటే దృష్టిదోషం కలగకూడదని అనేక ప్రక్రియలు చేసేది. తన బిడ్డను" బ్రహ్మజ్ఞాని"

"బిడ్డల గురువు" అని అందరూ పిలుస్తుంటే, ఆమెకి ఆశ్చర్యంతో పాటు భయం కూడా వేసేది. అన్ని అనుబంధాలు తెంచుకున్న తన బిడ్డ ఆవూరు వదిలి తనకు దూరం అవుతాడేమోనని భయంతో "సత్యం నీవు మాత్రం హిమాలయాలకు, కొండ గుహల్లోకి వెళ్ళవద్దు. పుట్టపర్తిలోనే ఉంటానని మాట ఇవ్వు. నీ భక్తులను ఇక్కడికే రానివ్వు. మేము వారందరిని ఆనందంగా ఆహ్వానిస్తున్నాము" అని ఈశ్వరమ్మ వేడుకున్నది. అప్పుడు సత్యం" నేను పుట్టపర్తినే అవతార కార్యక్రమానికి కార్యస్థలం గా ఎన్నుకున్నాను. ఈ వరాన్ని నేను నీకే కాదు, ఈ గ్రామానికి, ప్రపంచానికి ప్రసాదిస్తున్నాను" అని అభయమిచ్చాడు. ఆ ప్రకారంగా పుట్టపర్తి లోనే ఉండి పుట్టపర్తిని సర్వమత దివ్య క్షేత్రం గా చేశాడు.

**ఈశ్వరమ్మ గారి మూడు కోరికలు:**

ఆ తల్లి హృదయం నవనీతం. ఆమె ప్రేమలో ఆ రుచి చూసి కాబోలు "తల్లి ప్రేమ వెన్న కన్న సున్నితం" అన్నారు.ఈశ్వరమ్మ గారు మొట్టమొదటగా "స్వామీ! ఆడవారు దూరాల నుండి

మంచినీరు మోసుకుని వస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఒక బావి త్రవ్వించండి ” అని కోరగానే ప్రశాంతి నిలయంలో గోపురం గేటు వద్ద ఒక బావి త్రవ్వించారు.

పుట్టిన చంటి బిడ్డలను ఎత్తుకుని వైద్యం కోసం వేరే వూళ్లకు పరిగెడుతున్న మహిళలను, పిల్లల్ని చూస్తున్న ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయి, పుట్టపర్తిలోనే ఆసుపత్రి కట్టించమన్నారు. స్వామి పుట్టపర్తిలోనే జనరల్ హాస్పిటల్ కట్టిం చారు.

ఈశ్వరమ్మ గారికి పిల్లలంటే ఎంతో మక్కువ. అటువంటి పిల్లలు పుస్తకాల సంచీలు భుజాలపై వేసుకుని దూర ప్రదేశాలకు నడిచి వెళ్తూ కష్టపడడం చూడలేకపోయింది. ఆమెది జాలిగుండె. “స్వామి! మన ఊరి పిల్లలకు ఒక పాఠశాలను కట్టించు” అని అభ్యర్థించింది. దాని ఫలితమే ఈశ్వరమ్మ ప్రాథమిక విద్యాలయము.

నాటి చిన్న బావి సుజల స్రవంతి యై సాయి గంగగా లక్షల మంది దాహార్తిని తీరుస్తోంది. చిన్న ఆస్పత్రి నేడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి గా వృద్ధి అయ్యింది.

ప్రాథమిక పాఠశాల ప్రపంచంలోనే మేటి అయిన శ్రీ సత్య సాయి విశ్వ విద్యాలయంగా రూపొందింది.

**మాతృ వాక్య పరిపాలన:**

తన మాతృమూర్తి ఈశ్వరమ్మ కోరిన మూడు కోరికలు కేవలం పుట్టపర్తికి మాత్రమే పరిమితం చేయకుండా, స్వామి తన అనుగ్రహాన్ని సమస్త ప్రపంచానికి అందించారు. ఒక చినుకుగా ప్రారంభమై, నదిగా రూపుదిద్దుకుని, ప్రవాహ వేగాన్ని అందుకొని, ఒక నీటి చుక్క సముద్రం ఎట్లా అవుతుందో స్వామి ప్రేమ ఆ చినుకుగా ప్రారంభమై, ఒక జీవనదిగా ఈ ప్రపంచం యొక్క అవసరాన్ని తీరుస్తూనే ఉంటుంది.

యుగయుగాలుగా మాతృమూర్తులను మన్నిస్తూ అవతారపురుషులు లోకానికి మార్గదర్శకులయ్యారు. కృతయుగంలో వామనుడు, త్రేతాయుగంలో శ్రీరాముడు, కలియుగంలో శంకర భగవత్పాదులు, శ్రీ సత్యసాయి భగవానులు తమ తల్లిదండ్రులను గౌరవించి లోకారాధ్యులయినారు.

స్వామి ఈశ్వరమ్మ చేత అనేక పుణ్యకార్యాలు చేయించారు.
స్వామి చేపట్టిన అన్ని సేవాకార్యక్రమాలలో ఈశ్వరమ్మ గారు ఉండేవారు.
1972వ సంవత్సరం బెంగళూరులో ప్రారంభించిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు ఆమె ఎంతో ప్రేమ ,ఆప్యాయతలను అందించారు. స్వామి11వ రోజున కిరీట కోదండ సహిత శ్రీరామచంద్రునిగా దర్శనమిచ్చారు. ఆమె ఆ అనుభూతి లోనే పరవశించి పోయింది. మే 6 తేదీన ఉన్నట్టుండి స్వామి గది వైపు చూసి "స్వామి స్వామి" అని పెద్దగా పిలిచింది. స్వామి "వస్తున్నా! వస్తున్నా!" అన్నారు. ఆ పలుకులు విని ఆమె తుది శ్వాస విడిచింది. ఇటువంటి అనాయాస మరణం ఏ ఒక్కరికో  గాని లభించదు. భగవంతుడిని స్మరించటమే కాదు, భగవంతుని పిలుపు కూడా వినడం అందరికీ సాధ్యపడదు." ఇదే మోక్షప్రాప్తికి అర్హత" అని స్వామి చెప్పారు.

**<u>తల్లిపై స్వామి ప్రేమ:</u>**

ప్రపంచ చరిత్రలో మే 6వ తేది ఈశ్వరమ్మ సంస్మరణ దినోత్సవం గా పరిగణించబడుతున్నది. విరాణ్మూర్తి  అయిన సత్యసాయీశ్వరుని మాతృమూర్తి విశ్వజనని అయింది. ఆ తల్లికి పిల్లల పట్ల ప్రేమ కారణంగా బాబా వారు ఆమె వర్ధంతిని "బాలల దినోత్సవంగా" ప్రకటించారు. దీనిని బాలలు ఈశ్వరమ్మ గారి వారోత్సవాలుగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. స్వామి విశ్వానికి భగవానుడైనా, మే ఆరవ తేదీ ప్రతి సంవత్సరము తన కన్నతల్లి గా ఎంచుకున్న ఆ దివ్య గర్భ సమాధి వద్దకు వెళ్లి నివాళులర్పించే వారు. స్వామి ఈశ్వరమ్మ గారి సహజ ప్రేమను దివ్య ప్రేమ గా మార్చారు.

**<u>అమ్మ:</u>**

తల్లి తండ్రి గురువు దైవం, ఇలా తల్లికే దైవం కంటే ప్రథమ స్థానం ఇచ్చారు. ఎందుకంటే మనలను కని పెంచడమే కాక, మనకు కనిపించే దైవం కూడా తానే కదా!
అమ్మ అంటేనే ఒక అనురాగం, ఒక ఆత్మీయత, ఒక ప్రేమ, ఒక ధైర్యం! ఇలా ఎన్నైనా చెప్పవచ్చు. ఆ భగవంతుడైన తాను అవతారించవలసి వచ్చినప్పుడు తల్లి గర్భంలో నుంచే

కదా ఉద్భవించేది. అందుకే ఆ భగవంతుని చే ప్రేమించబడి, ఆరాధించబడే అదృష్టం ఒక్క అమ్మకే సొంతం. త్రేతాయుగంలో శ్రీరాముని తల్లి అయిన కౌసల్యా దేవి, ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని పెంచిన తల్లిగా యశోదాదేవి, కలియుగములో స్వామివారి కన్నతల్లి అయిన ఈశ్వరాంబా అదృష్టవంతులు అయిన కన్నతల్లులు. ఆ భగవంతుడు ప్రతి ఇంటిలో తన ప్రతిరూపంగా అమ్మ రూపంలో ఉంటాడు

జపతపాలు, దానధర్మాలు చేసిన వారు ఏ ఉత్తమగతులు పొందుతారో కానీ, తల్లిదండ్రులను పూజించిన వారు మాత్రం ఖచ్చితంగా అంతకంటే ఎక్కువ ఉత్తమ గతులను పొందుతారు. భక్త పుండరీకుని కరుణించడానికి వచ్చిన ఆ పాండురంగడు సైతం తల్లిదండ్రుల సేవలో నిమగ్నమైయున్న పుండరీకుని చూసి, బయట నిలబడి నిరీక్షించాడు కదా! ఈ ప్రపంచంలో తీర్చలేనిది ఏమైనా ఉంటే అది తల్లిఋణం మాత్రమే. అంతేకాదు తమ తల్లిదండ్రులను గౌరవించ లేనివారికి తమ పిల్లల ఆదరాభిమానాలను పొందే అర్హత ఎలా ఉంటుంది? ఇప్పుడు అర్థమైంది కదా! మనం తల్లిదండ్రులను ఎందుకు గౌరవించాలో!

భారతదేశంలో ఎందరో మహనీయులు దివ్యత్వాన్ని మాతృ స్వరూపంగా భావించి, ఆరాధించి తరించారు. ఇలాంటి మాతృమూర్తులకు శిరస్సు వంచి నమస్సుమాంజలులర్పిస్తూ**, మాతృ పూజను ప్రారంభించుకుందాము!**

మూడు సార్లు ‘‘ఓంకారం” తో పూజను ప్రారంభించాలి.

అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతోపివా

యస్మరేత్ పుండరీకాక్షం స బాహ్యాభ్యంతర శుచిః

పుండరీకాక్షః మూడు సార్లు అనుచు కొన్ని నీళ్ళు తలపైన ప్రోక్షించుకోవాలి.

**గణేశ ప్రార్థన:**

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే

కవిం కవీనాముపమశ్రవస్తమమ్

జేష్ట రాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆనః శ్రుణ్వన్నూతిభిఃస్సీద సాదనమ్!

ప్రణోదేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ! దీనామ విత్రయవతు!

ఓం గణేశాయ నమః!

సరస్వత్యై నమః!

శ్రీ గురుభ్యోనమః!

హరిః ఓం!

శుక్లాంబరధరం విష్ణుం! శశి వర్ణం చతుర్భుజం!

ప్రసన్న వదనం ధ్యాయేత్! సర్వ విఘ్నోప శాంతయే!

ఓం సాయీశ్వరాయ విద్మహే సత్య దేవాయ ధీమహి

తన్న: సర్వ ప్రచోదయాత్! అక్షతలు వేసి నమస్కరించుకోవాలి .

**ఆచమనం:**

* ఓం కేశవాయ స్వాహా
* ఓం నారాయణాయ స్వాహా
* ఓం మాధవాయ స్వాహా
* ఓం గోవిందాయ నమః
* ఓం విష్ణవే నమః
* ఓం మధుసూదనాయ నమః
* ఓం త్రివిక్రమాయ నమః
* ఓం వామనాయ నమః
* ఓం శ్రీధరాయ నమః
* ఓం హృషీకేశాయ నమః

* ఓం పద్మనాభాయ నమః
* ఓం దామోదరాయ నమః
* ఓం సంకర్షణాయ నమః
* ఓం వాసుదేవాయ నమః
* ఓం ప్రద్యుమ్నాయ నమః
* ఓం అనిరుద్ధాయ నమః
* ఓం పురుషోత్తమాయ నమః
* ఓం అధోక్షజాయ నమః
* ఓం నారసింహాయ నమః
* ఓం జనార్ధనాయ నమః
* ఓం అచ్యుతాయ నమః
* ఓం ఉపేంద్రాయ నమః
* ఓం హరయే నమః
* ఓం శ్రీ కృష్ణాయ నమః

**భూశుద్ధి:**

ఉత్తిష్టంతు భూతపిశాచాః ఏతే భూమి భారకాః

ఏతేషా మవిరోధేన బ్రహ్మ కర్మ సమారభే!

వెనక వైపున భూమిపై అక్షతలు చల్లాలి

**ప్రాణాయామం:**

ముక్కు పట్టుకుని ప్రాణాయామం చేయాలి

ఓం భూః--ఓం భువః-ఓం సువః--ఓం మహః-ఓం జనః-ఓం తపః- ఓం సత్యం-

ఓం తత్సవితుర్వరేణ్యం-భర్గోదేవస్య ధీమహి-ధియోయోనః ప్రచోదయాత్!

ఓం ఆపో జ్యోతి రసోమృతం-బ్రహ్మ భూర్భువస్సువరోమ్.

## సంకల్పం

ఓం గోవింద గోవింద శుభే శోభనే ముహూర్తే శ్రీమహావిష్ణోరాఘ్నాయ ప్రవర్త మానస్య అద్య బ్రహ్మాణః ద్వితీయ పరార్ధే ,శ్వేతవరాహ కల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే, జంబూ ద్వీపే, భరతవర్షే, భరత ఖండే క్షేత్రః సమస్త దేవతా బ్రాహ్మణ హరిహర సన్నిధౌ, అస్మిన్ వర్తమాన, వ్యావహారిక చాంద్రమానేన ప్రభవాది షష్టి సంవత్సరణాం మధ్యే, శార్వరి నామ సంవత్సరే, ఉత్తరాయణే, వసంతఋుతౌ, వైశాఖ మాసే, శుక్లపక్షే, చతుర్దశ్యాం, సౌమ్య వాసరే, చిత్తా నక్షత్రే, శుభయోగే, శుభకరణే, ఏవంగుణ విశేషణ, విశిష్టాయాం, శుభతిదౌః

మమ

ఇక్కడ గోత్రనామాలు చెప్పుకోవాలి శ్రీమాన్(Name).... గోత్రః ... అహం మమ ఉపాత్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ముద్దిశ్య, పరమేశ్వర ప్రీత్యర్థం మాతృ పూజాంచ కరిష్యే!

తల్లి పాదాలపై కొన్ని నీళ్ళు చల్లండి

**ఆవాహనం:**

ఓం హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం!

చంద్రాం హిరణ్మయీం లక్ష్మీమ్  జాతవేదో మాఆవహా!

శ్రీ మాతృ దేవ్యై నమః... ఆవాహయామి.

తల్లి పాదాల పై అక్షతలు వేయండి

**ఆసనం:**

తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీ మనపగామినీమ్!

యస్యాం హిరణ్యం విందేయం గామశ్వం  పురుషానహం!

శ్రీ మాతృ దేవ్యై నమః... దివ్య సింహాసనం సమర్పయామి.

కొన్ని అక్షతలు పూలు వేయండి

**పాద్యం:**

అశ్వ పూర్వం రథమధ్యాం  హస్తినాద ప్రభోధినీం!

శ్రియం దేవిముపహ్వాయే శ్రీర్మాదేవీర్జుషతామ్!

శ్రీ మాతృ దేవ్యై నమః.... పాద్యం సమర్పయామి.

పుష్పములతో నీరు  చలండి.

**అర్ఘ్యం:**

కాంసోస్మితాం హిరణ్య ప్రాకార మార్ద్రాం జ్వలంతీం తృప్తాం

తర్పయంతీం! పద్మే స్థితాం పద్మ వర్ణాం తామిహోపహ్వాయే శ్రియం!

శ్రీ మాతృ దేవ్యై నమః...హస్తయోరర్ఘ్యం సమర్పయామి.

తల్లి చేతులపై నీరు వదలండి

**ఆచమనీయం:**

చంద్రాం ప్రభాసాం యశసా జ్వలన్తీం శ్రియం లోకే దేవజుష్టాముదారాం!

తాం పద్మినీమీం శరణమహం ప్రపద్యే అలక్ష్మీర్మే నశ్యతాం త్వాం వృణే!

శ్రీ మాతృ దేవ్యై నమః.... ముఖే ఆచమనీయం సమర్పయామి.

తల్లి చేతిలో నీరు పోయండి

**పంచామృతం:**

ఆదిత్య వర్ణేతపసోధిజాతో వనస్పతిస్తవ వృక్షోధబిల్వః!

తస్య ఫలాని తపసానుదన్తు మాయాంతరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః!

శ్రీ మాతృ దేవ్యై నమః... పంచామృతం సమర్పయామి.

తల్లిపై పువ్వుతో నీరు చిలకరించండి

**వస్త్రం**

ఉపైతుమాం దేవ సఖః కీర్తిశ్చ మణినాసహ !

ప్రాదుర్భూతో స్మి రాష్ట్రేస్మిన్ కీర్తి మృద్ధిం దదాతుమే!!

శ్రీ మాతృ దేవ్యై నమః.... వస్త్రయుగ్మం సమర్పయామి.

తల్లికి రవిక గుడ్డ ఇవ్వండి

**ఉపవీతం:**

క్షుత్పిపాసా మలాంజ్యేష్టా మలక్ష్మీం నాశయామ్యహం!

అభూతి మసమృద్ధించ సర్వాం నిర్ణుదమే గృహాత్!!

శ్రీ మాతృ దేవ్యై నమః... ఉపవీతం సమర్పయామి.

తల్లికి అక్షతలను వేయండి

**గంధం**

గంధద్వారాం దురదర్శాం నిత్యపుష్టాం కరీషిణీం!

ఈశ్వరీగ్ం సర్వ భూతానాం తామిహోపహ్వయే శ్రియం!!

శ్రీ మాతృ దేవ్యై నమః.... గంధం సమర్పయామి.

తల్లికి గంధం, పసుపు, కుంకుమ ఇవ్వండి

**ఆభరణాలు**

మనసఃకామ మాకూతిం వాచః సత్య మశీమహి!

పశూనాం రూపమన్నస్య మయిశ్రీః శ్రయతాం  యశః!!

శ్రీ మాతృ దేవ్యైనమః... సర్వాభరణాని సమర్పయామి.

అక్షతలు, పూలు ఇవ్వండి

**పుష్పములు:**

కర్దమేన ప్రజా భూతా మయిసంభవ కర్దమ!

శ్రియం వాస యమేకులే మాతరం పద్మమాలినీమ్!!

శ్రీ మాతృ దేవ్యై నమః... పుష్పం సమర్పయామి.

పువ్వులతో తల్లి పాదములను పూజించండి

**ధూపం:**

ఆపఃస్రుజంతు స్నిగ్ధాని చిక్లీత వసమే గృహే!

ని చ దేవీం మాతరం శ్రియం వాసయమేకులే!!

శ్రీ మాతృ దేవ్యై నమః... ధూపమాఘ్రాపయామి.

ధూపము నకు నమస్కారం చెయ్యండి

**దీపం**

ఆర్ద్రాం పుష్కరిణీం పింగళాం పద్మ మాలినీం!

చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహా!!

శ్రీ మాతృ దేవ్యై నమః... దీపం దర్శయామి.

దీపమునకు నమస్కారం చేయండి

**నైవేద్యం:**

ఆర్ద్రాం యః కరిణీం యష్టీం సువర్ణాం హేమమాలినీమ్!

సూర్యామ్ హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహా!!

శ్రీ మాతృ దేవ్యై నమః... నైవేద్యం సమర్పయామి.

తల్లికి స్వీటు తినిపించండి

**తాంబూలం**

తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీమనపగామినీమ్!

యస్యామ్ హిరణ్యం ప్రభూతం గావో దాస్యోశ్వాన్విందేయం పురుషానహమ్!!

శ్రీ మాతృ  దేవ్యై నమః... తాంబూలం సమర్పయామి.

తల్లికి తాంబూలం ఇవ్వండి

**మంత్రపుష్పం:**

పద్మ ప్రియే పద్మిని పద్మహస్తే పద్మాలయే పద్మ దళాయతాక్షి!

విశ్వ ప్రియే విష్ణు మనోనుకూలే త్వత్పాదపద్మం మయి సన్నిదత్స్వ!!

లక్ష్మీం క్షీర సముద్ర  రాజతనయాం శ్రీరంగధామేశ్వరీం!

దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం!

శ్రీమన్మందకటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరాం!

త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం!!

తల్లి పాదాల పై అక్షతలు, పూలు సమర్పించండి

**ఆత్మ ప్రదక్షిణం:**

యానికానిచ పాపాని జన్మాంతర కృతానిచ

తాని తాని ప్రణశ్యంతి  ప్రదక్షిణ పదే పదే!

ప్రాప్తోహం ప్రాప్త కర్మాహం  ప్రాప్తాత్మా ప్రాప్త సంభవ

త్రాహిమాం కృపయాదేవి శరణాగతవత్సలే!!

అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ

తస్మాత్ కారుణ్య భావేన శ్రీలక్ష్మి రక్షమాం సదా!!

శ్రీ మాతృ దేవ్యై నమః... ఆత్మప్రదక్షిణ నమస్కారం సమర్పయామి.

చేతిలో పువ్వులు అక్షతలు తల్లికి ప్రదక్షిణం చేసి సమర్పించాలి, నమస్కరించాలి

**తల్లి చుట్టూ ప్రదక్షిణం:**

తల్లికి ప్రదక్షిణం ఎందుకు చేయాలంటే

ప్ర అనగా పాప సంహారము

ద అనగా దమము(ఇంద్రియ నిగ్రహము)

క్షి అనగా తక్షణ ఫలము

ణమ్ అనగా జ్ఞాన మార్గము

పాప, శాప, తాపములు మూడు ప్రదక్షిణల తో నశిస్తే జ్ఞాన మార్గంలో

ప్రవేశించటం అని అర్థం.

**<u>సాష్టాంగ నమస్కారం:</u>**

ఉరసా శిరసా దృష్ట్యా మనసా వచసా తథా
పద్భ్యాం కరాభ్యాం కర్ణాభ్యాం ప్రణామోష్టాంగముచ్యతే!
శ్రీ మాతృ దేవ్యై నమః... సాష్టాంగ నమస్కారాన్ సమర్పయామి.
చేతిలో పువ్వులు అక్షతలు వారి పాదములపై ఉంచి భక్తి పూర్వకంగా నమస్కరించాలి
ఈ విధంగా వినాయకుడు ప్రదక్షిణలు చేసి గణాధిపత్యం పొందాడు. మీరు కూడా ఇలా చేసి
మంచి ఫలితాలు పొందగలరు.

**<u>మాతృ దీవెన:</u>**

తల్లి అక్షితలు తన చేతిలో పెట్టుకుని
పరమ పవిత్ర భారతదేశంలో జన్మ ఎత్తటమే గొప్ప విశేషం. ఇది వేద ప్రమాణం! తల్లి
గర్భాలయం నుంచి మనిషి తన జీవన యాత్రను ప్రారంభించి, *ఉన్నతమైన భగవంతుని
స్థాయికి చేరుకోవటానికి ఈ జన్మ ఇవ్వబడినది.*

**<u>తల్లితో క్రింద ఆశీర్వచనము చేయించాలి:</u>**

"ఒక తల్లిగా నేను, మీకు జన్మ ఇచ్చినందుకు, భగవంతుని యందు భక్తిని, ఈ దేశం పట్ల
ప్రేమను, ఈ జాతి సంస్కారం పట్ల మీకున్న గౌరవాన్ని చూసి నా మనసు ఎంతో
ఆనందిస్తున్నది. తల్లి, తండ్రి, గురువు ఒక్కటైనదే మాతృ స్వరూపము. మీ ప్రవర్తన, మీ ప్రజ్ఞ,

అంకిత భావము, సమాజ సేవ, దైవభక్తి మిమ్ముల‌ను చిరంజీవులను చేయాలని నా ఆశీర్వచనాన్ని అందిస్తున్నాను”

తల్లి అక్షతలు వేసి మనస్ఫూర్తిగా ఆశీర్వదించవలెను

**స్వామి మంగళ హారతితో కార్యక్రమాన్ని ముగించవలెను.**




**సమస్త లోకాః సుఖినో భవంతు**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**